ట్రిపుల్ ఐటీలో సత్తాచాటిన విద్యార్థులు

అభినందించిన మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, జూలై 3: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి తమ ప్రతిభను కనబర్చారు. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 169 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లను సాధించడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు, ల్లిదండ్రులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలాల వారీగా చూస్తే అత్యధికంగా చిన్నకోడూరు మండలంలో 62 మంది విద్యార్థులు, నంగునూరు మండలంలో 61 మంది , నారాయణరావుపేట మండలంలో 11 మంది, సిద్దిపేట అర్బన్ మండలంలో 24 మంది, సిద్దిపేట రూరల్ మండలంలో 11 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలి

నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

నంగునూరు, జూలై 3 : నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి సూచించారు. బుధవారం మండల పరిధిలోని నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పిల్లర్ల దశను వేగంగా పూర్తి చేయాలని, లేకుంటే అధికంగా వర్షాల వల్ల పనులన్నీ ఆగిపోయే అవకాశం ఉందన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 3: మద్దూరు మండల కేంద్రంలోని రామాలయ 35వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు తిగుళ్ల రామ్మూరి శర్మ, పార్నంది ఆంజనేయశర్మ వైదిక నిర్వహణలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను జరిపించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకుడు పానుగంటి తిరుపతయ్య, ఉప్పల వైకుంఠం, బుస్సా బాలయ్య, ఉప్పల రామనాథం, నాళ్ల గౌరీశంకర్, వీరేశం, భూర్గు శంకర్, రాజు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూలై 3 : భావితరాల భవిష్యత్‌కోసం పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న కోరారు. పట్టణంలోని మూడోవార్డులోని సిద్ధార్థ ఇంగ్లిష్‌మీడియం హైస్కూల్‌లో సఫాయి అప్నాభీమారి భగావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ బదులు బట్టసంచులు ఉపయోగించుకునే విధంగా తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజన్‌వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని, వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ కోమటి స్వర్ణలత, స్కూల్‌చైర్మన్ రాధా సురేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, బేసిల్ ఫౌండేషన్ పౌండర్ ఉదయ్, వైద్య, ఆరోగశాఖ, వార్డుఅధికారి, ఆర్పీ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

చేర్యాల, జూలై 3 : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్నట్లుగా తెలంగాణలో అమలు చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్‌ఎంఆర్, ఫిక్స్ పే తదితర పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 60ని విడుదల చేసి కేటగిరీల వారీగా వేతనాలను రూ.15,600, రూ.19,600, రూ.27,750 గతంలో నిర్ణయించిందని, కానీ దానిని అమలు చేయడం లేదన్నారు. ప్రమాదాలు జరిగితే బీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, కార్మికుడు మరణిస్తే దహన సంస్కారాల కోసం రూ.30వేలు చెల్లించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ, జిల్లా కమిటీ సభ్యుడు రాళ్లబండి భాస్కర్, యూనియన్ నాయకులు సంతోష్, యాదయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రకటించాలి

కొమురవెల్లి, జూలై 3: స్వామినాథన్ సిఫారసుల ఆధారంగా రైతులకు మద్దతు ధర ప్రకటించాలని బుధవారం మండల కేంద్రంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి పల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జూన్ 19న రైతులకు కంటి తుడుపు చర్యగా నామమాత్రపు మద్దతు ధరలు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 20 నుంచి 22 శాతం పెరిగాయని, దానికి 50శాతం కలిపి ధరలు ప్రకటించాలన్నారు. వానకాలానికి సంబంధించిన యూరియా, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ముందస్తు ప్రణాళిక ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణారెడ్డి, నాయకులు నీలం భిక్షపతి, ఉల్లంపల్లి సాయిలు, దయానంద్, దాసరి చక్రపాణి, గాంధారి శ్రవణాచారి, నర్సింహులు పాల్గొన్నారు.

పార్కు పనులను పరిశీలించిన చైర్‌పర్సన్

దుబ్బాక, జూలై 3 : దుబ్బాక పట్టణంలోని 18వ వార్డులో చిన్నారుల కోసం ప్రత్యేకంగా బృందావనం (పార్కును) ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.30 లక్షలతో పార్కు సుందరీకరణ పనులు చేపడుతున్నారు. బుధవారం పార్కులో చేపడుతున్న పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి పర్యవేక్షించారు.

400కిలోల పటిక, 8లీటర్ల నాటుసారా పట్టివేత

హుస్నాబాద్, జూలై 3: హుస్నాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్కన్నపేట మండలం నందారం క్రాస్‌రోడ్డు వద్ద ఆటోలో తరలిస్తున్న నాటుసారా తయారీకి ఉపయోగించే 400కిలోల పటికతో పాటు 8లీటర్ల నాటు సారాని సిద్దిపేట ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్, హుస్నాబాద్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రూట్ వాచ్‌లో భాగంగా వివిధ వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా రవాణా చేస్తున్న పటిక, నాటుసారాని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన బాషబోయిన లింగం, విజయ, అక్కన్నపేట మండలం చౌటకుంట తండాకు చెందిన భూ క్యా శంకర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పటికను వీరికి సరఫరా చేసిన ధూళిమిట్ట మండలానికి చెందిన బానోతు శ్రీనివాస్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై దామోదర్, చేర్యాల ఎస్సై సురేశ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల కోసం రాజీలేని పోరాటం

మద్దూరులో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 3: జనగామ నియోజకవర్గానికి న్యాయంగా దక్కాల్సిన నిధుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సభ్యుల పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలపై ఎలాంటి వివక్ష లేకుండా సీడీఎఫ్ నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నట్లు తెలిపారు. తన నీలిమా దవాఖాన ద్వారా రాజకీయపార్టీలకతీతంగా నియోజకవర్గంలోని ఎంతోమందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యా, వైద్యం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మద్దూరు మండలం వైతన్యానికి ప్రతీక అని కొనియాడారు. నాటి సాయుధ రైతాంగ పోరాటం, నక్సలైట్ ఉద్యమాలతో పాటు మలిదశ తెలంగాణ ఉద్యమానికి మద్దూరు నేల ఊపిరిపోసిందన్నారు. ఐదేండ్ల పాటు ప్రజాప్రతినిధులుగా ప్రజా సేవకు అంకితమైన ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పదవి విరమణ పొందిన ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, ఎంపీటీసీలు చెట్కూరి కల్యాణికమలాకర్, బొప్పె కనకమ్మనాగయ్య, గూళ్ల సత్యకళాఆనందం, ఇస్లావత్ నముక్, గుజ్జుక సమ్మయ్య, ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, నందనబోయిన నర్సింహులు, కూరెళ్ల రాజు గౌడ్, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ జిలానీలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి రాధిక, తహసీల్దార్ సంజయ్‌కుమార్, ఎంపీడీవో రామ్మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉంటా

చిన్న వయస్సులోనే తనకు కొమురవెల్లి ఆలయ చైర్మన్‌గా, మద్దూరు ఎంపీపీగా అవకాశం ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీకి, మాజీ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటానని మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఐదేండ్లలో ఉమ్మడి మద్దూరు మండల అభివృద్ధికి అప్పటి రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో రూ.8కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారి మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎంపీపీ సన్మానించారు. అంతకు ముందు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు. సమావేశంలో జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాధిక, తహసీల్దార్ సంజయ్‌కుమార్, ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్-టీఎస్ కరపత్రం ఆవిష్కరణ

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 3 : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తలపెట్టిన దీక్షను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్-టీస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్‌తో కలిసి బుధవారం మద్దూరులో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, వైస్‌ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, బీఆర్ఎస్ నాయకులు సాగర్, వెంకట్‌గౌడ్, భూపతి, తాళ్లపల్లి భిక్షపతి, అరుణ, దామెర మల్లేశం, ఇమ్మడి సంజీవరెడ్డి, ఎమ్మార్పీఎస్-టీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపతి, నాయకులు బాలకృష్ణ, తిరుపతి, నవీన్, శోభన్, భూపతి, రమేశ్, రాము, రాజు పాల్గొన్నారు.

అరుదైన సిడితల వీరగల్లు విగ్రహాల గుర్తింపు

రాయపోల్,జూలై 3 : రాయపోల్‌లోని గణపతి దేవాలయం దగ్గర అరుదైన వీరగల్లు విగ్రహాలను కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ బుధవారం గుర్తించాడు. ఈ విగ్రహాలు చాళుక్య, రాష్ట్ర కూటుల కాలానికి చెందినవిగా ఆయన వెల్లడించారు. వాటిలో ఒక ప్రత్యేక వీరగల్లు విగ్రహాన్ని సిడితల వీరగల్లు అంటారని, రెండంతలు ఉన్న ఈ వీరగల్లు విగ్రహంలోని మొదటి అంతస్తులో ఒక వీరుడు కూర్చుని ఉన్నాడు. వీరగల్లు పట్టుకున్న పరికరమేదో అస్పష్టంగా ఉంది. వీరుడి నడినెత్తిన కొప్పు ఉంది.వంచిన వెదురు గడకు తల తెగి స్పష్టంగా కనిపిస్తున్నది. అంజలిపట్టిన వీరుడు ఆసన్నస్థితిలో కూర్చుని ఉన్నాడు. ఆత్మాహుతి చేసుకున్న వీరుడిని దేవలోకానికి తీసుకుపోతున్న ఇద్దరు చామరాంగలు పైఅంతస్తులో కనిపిస్తున్నారు. ఇలాంటి శిల్పాన్ని సిడితల వీరగల్లు విగ్రహం అంటారు. ఇలాంటి వీరగల్లులు తెలంగాణలో పది వరకే ఉన్నట్లు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. స్థీ సిడితల వీరగల్లులు చొలేరు,వనపర్తి గ్రామంలో దొరికాయి, పురుష సిడితల వీరగల్లులు లింగంపల్లిలో ఇప్పుడు రాయపోల్‌లో లభించినట్లు శ్రీనివాస్ తెలిపారు.

అధికారుల తీరుపై రైతుల అసహనం

మిరుదొడ్డి, జూలై 3 : రైతు భరోసా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా ప్రజాభిప్రాయ సేకరణను చేపడుతున్నది. బుధవారం మిరుదొడ్డి టౌన్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై సహకారంశాఖ అడిట్ అధికారి ఎ.నాగేశ్వర్‌రావు సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. రైతులు, గ్రామస్తులకు సమాచారం లేకుండా చేపట్టిన రైతు భరోసా ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం ప్రజలు లేక వెలవెల పోయింది. స్థానిక అధికారుల నిరక్ష్యం కారణంగానే సమాచారం అందడం లేదని రైతులు మండిపడ్డారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, ఏవో మల్లేశం, సీవో రాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, జూలై 3: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బూరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ సైదా, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో ఉండే నాయకులకు ప్రత్యేక గుర్తింపు

ఎంపీపీ ఎంపీటీసీలను సన్మానిస్తున్న మండల అధికారులు

జగదేవ్‌పూర్, జూలై 3 : నిత్యం ప్రజల్లో ఉండే నాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎంపీపీ బాలేశంగౌడ్ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, ప్రజా సేవతోనే ప్రజల్లో మంచి గుర్తింపు పొందవచ్చని, ప్రతి ఒక్కరూ ఆదిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, వైస్‌ఎంపీపీ భగవంతం, ఎంపీటీసీలు కవిత, కావ్యాదర్గయ్య, స్రవంతీశివకుమార్, మహేందర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, జుబేదబేగం, మహేశ్, రమ్యరవి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్‌ను ఎంపీడీవో యాదగిరి, ఎంపీపీ శ్రీనివాసవర్మ, కార్యాలయ సిబ్బందితో కలిసి సన్మానించారు.

విధుల నుంచి ప్రిన్సిపాల్‌ను తొలిగించాలి

చేర్యాల, జూలై 3 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్స్ బృందం కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లి సన్మానించి పూలబొకే ఇచ్చి వినతిపత్రం ఇచ్చారని, కారణమైన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలిగించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకుల బృందం బుధవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువులు చెప్పకుండా కాలయాపన చేస్తూ, రాజకీయాలు చేస్తున్న వారి పై తగు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, తాడూరి భరత్‌కుమార్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

హుస్నాబాద్, జూలై 3: వానకాలం సీజన్‌లో హాస్టల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ డివిజన్ అధికారి పోగుల రాజు వార్డెన్లకు సూచించారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఖచ్చిత మైన మెను ఇవ్వాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరలోనే హాస్టల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, బెడ్‌షీట్స్, కార్పెట్స్ అందజేస్తామని తెలిపారు. వసతిగృహం సంక్షేమాధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందించాలి

సిద్దిపేట అర్బన్, జూలై 3 : బెస్ట్ అవలేబుల్ స్కూల్‌లో లక్కీ డ్రాలో వచ్చిన దళిత విద్యార్థులకు జీవో ప్రకారం రావాల్సిన మెటీరియల్ వెంటనే ఇవ్వాలని దళిత సంఘాల విద్యార్థి నాయకులు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బెస్ట్ అవలేబుల్ స్కూల్ అయిన టువంటి వికాస్ స్కూల్ విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వాలని, లేకపోతే సంబంధిత అధికారులు స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం విద్యార్థులకు పుస్తకాలు, టై, బెల్ట్, మెటీరియల్‌తో పాటు దూర ప్రాంతాల వారికి బస్సు సౌకర్యం లేదా హాస్టల్ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పాత బిల్లులను వెంటనే విడుదల చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపి దళిత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లేశ్, బీడీఎస్ఎఫ్ నాయకులు ఆనంద్, డేవిడ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వ సభ్య సమావేశం

సిద్దిపేట అర్బన్, జూలై 3: సిద్దిపేట అర్బన్ మండల చివరి సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవి కాలం ముగియడంతో అధికారులు చివరి సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో సమావేశం మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైనప్పటికీ ప్రజాప్రతినిధులు రాకపోవడంతో నామమాత్రంగా సమావేశం నిర్వహించి అధికారులు చేతులు దులుపుకొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన కారు డ్రైవర్ అరెస్ట్

సిద్దిపేట అర్బన్, జూలై 3 : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని కారుతో ఢీకొట్టి పారిపోయిన కారు డ్రైవర్‌ను త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల సిద్దిపేట-రాజీవ్ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి ఆచూకీ కోసం వివిధ మాధ్యమాలు సమాచారం అందించగా సిద్దిపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన జహంగీర్‌గా గుర్తించామన్నారు. గత నెల 27వ తేదీన రాజీవ్ రహదారి వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని బలమైన గాయాలై చనిపోయినట్లు తెలిపారు. నూతన టెక్నాలజీ పరిజ్ఞానంతో కేసు నమోదు చేసి సీసీ కెమెరాల సహాయంతో వివరాలు సేకరించామని.. జగదేవ్‌పూర్ మండలం మునిగడపకు చెందిన ఎండీ ఉస్మాన్ అనే వ్యక్తి కారుతో అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి జహంగీర్ మృతికి కారణమైనట్లు తెలిపారు. ఈ మేరకు కారు డ్రైవర్ ఉస్మాన్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

హుస్నాబాద్, జూలై 3: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం డివిజన్ గౌరవాధ్యక్షుడు, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన జీపీ కార్మికులతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అంటూ గ్రామాల్లో పనిచేసే జీపీ సిబ్బందికి కనీసం వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం బాధాకరమన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను వెల్లదీసుకుంటున్న కార్మికులకు నెల తరబడి వేతనాలు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం నాయకులు సిరికొండ సంపత్, వెంకటేశం, వేముగంటి మహేందర్, బత్తుల తిరుమల, మణెమ్మ, భారతి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పారిశుధ్య కార్మికులు

గజ్వేల్‌పట్టణంలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

గజ్వేల్, జూలై 3 : పారిశుధ్య కార్మికులు గజ్వేల్ పట్టణంలో రోడ్డెక్కారు. కొన్ని నెలలుగాప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదు. దీంతో బుధవారం పట్టణంలో భిక్షాటన చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశుధ్య కార్మికులపై కనికరం చూపాలని విజ్ఞప్తిచేశారు.

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

కొమురవెల్లి, జూలై 3 : సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. బుధవారం కొమురవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఆచార్య విపిన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

హుస్నాబాద్‌రూరల్, జూలై 3: హుస్నాబాద్ ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం హుస్నాబాద్ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులకు ఆత్మీయ సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీవైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి హాజరై మాట్లాడారు.అనంతరం జడ్పీ వైస్‌చైర్మన్, హుస్నాబాద్ జడ్పీటీసీ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ లకావత్ మానసతో పాటు పలువురు ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులను మాజీ సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు శాలువాలతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నార